క్లుప్తంగా

ఓటర్లు ఆలోచించి ఓటు వేయాలి..


మాట్లాడుతున్న రవీంద్రనాయక్

ఇల్లెందు: రాష్ట్రంలో కేసీఆర్ అవినీతికి చరమగీతం పలకాల్సిన తరుణం ఆసన్నమైందని, అందుకు ప్రజలు సిద్ధం కావాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డి.రవీంద్ర నాయక్ అన్నారు. ఆదివారం ఇల్లెందు 21 ఏరియాలో బీజేపీ ఇల్లెందు రూరల్ కార్యాలయం ప్రారంభోత్సవం చేశారు. మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు చారిత్రాత్మకమైనవన్నారు. కేసీఆర్ అవినీతి, పక్షపాతానికి రుజువు చేసే ఎన్నికలు జరుగుతున్నాయని, ప్రజలు ఆలోసించి ఓటు వేయాలన్నారు. ప్రపంచంలో కెల్లా భారత్‌లో అత్యధికంగా 11 కోట్ల సభ్యత్వం కలిగిన పార్టీ బీజేపీ ఒక్కటేనన్నారు. 70 ఏళ్లలో ఎవరూ సాధించలేని ఆర్టికల్ 370 రద్దు చేశారని తెలిపారు. ట్రిపుల్ తలాక్, రామాలయ నిర్మాణం, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ప్రకటించిందన్నారు. 80 కోట్ల పేదలకు సన్న బియ్యం, 20 కోట్ల కుటుంబాలకు విద్యుత్ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. పల్లె, ప్రకృతి వనాలు, రైతు వేదికలు, వైకుంఠధామాలు నిర్మించింది కూడా కేంద్రమేనని పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారానే సమస్యల పరిష్కారం అవుతాయన్నారు.

మార్పును స్వాగతిద్దాం..

ఇల్లెందు: భారత్ భవిష్యత్ యువత చేతిలో ఉందని, దేశంలో మార్పు కోసం యువత పోటీ పడాలని, గెలిచి ఈ దేశ భవిష్యత్‌ను మార్చివేయాలని ఎమ్మెల్యే స్వతంత్ర అభ్యర్థి కొముౌరారం గ్రామానికి చెందిన గుగులోతు సాయికుమార్ అన్నారు. ఆదివారం ఇల్లెందులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతోమంది ఇక్కడి నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచి ప్రజలల్లో మార్పును తీసుక రాలేకపోయారని తెలిపారు. నిస్వార్థంగా ఓటు వేయాల్సిన ప్రజలను అవినీతి పరులుగా మార్చి వేశారని, సంతలో ఓటును కారుచౌకగా అమ్మే దుస్థితికి తీసుకొచ్చారని ఆరోపించారు. మీరు స్వార్ధంతో వేసే ఓటు ఇంకో స్వార్థపరుడుకి అవకాశం ఇచ్చినట్లు అవుతుందన్నారు. ఈ నెల 8న నామినేషన్ వేయబోతున్నానని, అత్యధికంగా యువత తరలివచ్చి తనను బలపర్చాలని కోరారు.

వైఎస్సార్ టీపీకి రాజీనామా

ఇల్లెందు: గడిచిన రెండేళ్లుగా వైఎస్సార్ టీపీలో కొనసాగుతున్న నాయకులు పలువురు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇల్లెందు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాదార్‌బీ, నగారపు రాములు, కాశీచరణ్ అశోక్, ఎండీ నజీర్, ఊకె దశరథం, బండి కిరణ్, బాలాజీ నాయక్, ఫయాజుద్దీన్, జి.రామ్మూర్తి, షేక్ సమీర్, సందీప్‌పాసీ, ఓంనాథ్ లోథ్, మోహన్ రావు, నర్సింహాచారి, బాబూరావు తదితరులు మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబంపై అభిమానంతో వైఎస్సార్ టీపీలో చేరగా, ఆ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయకపోవడంతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం..

పాల్వంచ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం అలుపెరగని పోరాటం చేస్తున్నానని, తనను ప్రజలు ఆశీర్వదించాలని బీఎస్పీ కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేశ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పట్టణంలోని సీఎస్ఐ, ఆర్‌సీఎం, ఎల్‌జీఎం చర్చిలతో పాటు ఇందిరా కాలనీ నెహ్రూనగర్ తదితర ఏరియాల్లో పలు చర్చిలను సందర్శించారు. పాస్టర్‌లచే ప్రార్థనలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కామేశ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిస్వార్థంగా పనిచేసే వారికి యేసుక్రీస్తు దీవెనలు ఉంటాయన్నారు. బీఎస్పీ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, గుడివాడ రాజేందర్, తాటిపాముల హరికృష్ణ పాల్గొన్నారు.

నాటుసారా విక్రయదారులపై బైండోవర్

జూలూరుపాడు: నాటుసారా అక్రమంగా విక్రయిస్తున్న ఓ మహిళను ఆబ్కారీశాఖ అధికారులు ఆదివారం బైండోవర్ చేశారు. కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ ఎల్.జయశ్రీ కథనం ప్రకారం.. పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లాతండాకు చెందిన బానోత్ రామి నాటుసారా విక్రయిస్తుండగా ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకొని బైండోవర్ చేశారు. గతంలో కూడా నాటుసారా అమ్ముతూ ఆమె పట్టుబడిందని, ఆమెను తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి రూ.లక్ష బాండ్‌తో బైండోవర్ చేశామని వివరించారు. రామి పశ్చాతాపంతో తాను నాటుసారా అమ్మనని చెప్పడంతో ఆమెకు రెండో అవకాశం కల్పించినట్లు చెప్పారు. మళ్లీ పట్టుబడటంతో తహసీల్దార్ శారద ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లఘించిన రామికి తహసీల్దార్ రూ.70 వేలు జరిమానా విధించారని తెలిపారు.

గులాబీమయమైన 'గూడెం'

నవభారత్: కొత్తగూడెం పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి బహిరంగ సభకు కొత్తగూడెం మున్సిపాలిటీలోని వార్డుల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. రెండు గంటల పాటు ధూంధాం కళాకారుల ప్రదర్శనలు చూస్తూ నాయకులు, కార్యకర్తలు సభలో లీనమైపోయారు. సభలో యువకులు, వృద్ధులు, మహిళలు చిన్నారులతో ఉత్సాహంగా తరలివచ్చారు. ప్రకాశం మైదానం అంతా ప్రజల కేరింతలు, జై తెలంగాణ... నినాదంతో సభా ప్రాంగణం మార్మోగింది.

వారాంతపు సంత రద్దు..

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం హెడ్ ఆఫీస్ వద్ద ప్రతి ఆదివారం వారాంతపు జరుగుతుంది. ప్రజా ఆశీర్వాద సభకు సీఎం రానుండడంతో అధికారులు సంతను రద్దు చేయించారు. దీంతో చిరు వ్యాపారులు రూ.10 లక్షలకు పైగా వ్యాపారం నష్ట పోయినట్లు వాపోయారు. సీఎం పర్యటన నిమిత్తం తమ పొట్టకొట్టారని వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీఎం హెలికాప్టర్ రావడంతో అరుపులు కేకలు..

కొత్తగూడెం సింగరేణి ప్రకాశం స్టేడియంలో జరుగుతున్న ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సీఎం హెలికాప్టర్‌ను చూసి ఆనందంగా కేకలు వేశారు. హెలికాప్టర్ సభా వేదిక మీదుగా ప్రగతి మైదానంలో దిగేందుకు వస్తుండగా.. సీఎం హెలికాప్టర్‌ను చూసి కార్యకర్తలు జై కేసీఆర్.. అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. సభా ప్రాంగణం ఒక్కసారిగా కేసీఆర్ నామస్మరణతో మార్మోగింది.

షాపుల బంద్..

కొత్తగూడెం సింగరేణి ప్రకాశం స్టేడియంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ప్రజా ఆశీర్వాద సభను నిర్వహించారు. ఈ సభకు సీఎం కేసీఆర్ హాజరుకానుండటంతో సభా ప్రాంగణానికి కిలోమీటరు దూరం వరకు అధికారులు షాపులను మూసి వేయించారు. దీంతో వ్యాపారులు ఆదివారం జరగాల్సిన వ్యాపారాలను నష్టపోవాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటల్స్, కిరాణా షాపులు, కూరగాయలు, కటింగ్, పండ్ల దుకాణాలను ఉదయం నుంచి సీఎం పర్యటన ముగిసే వరకు మూసివేసి ఉంచారు.

విధుల వద్దనే పోలీసుల భోజనాలు..

కొత్తగూడెంలో సీఎం ఆశీర్వాద సభ జరగనుండటంతో బందోబస్తుకు వచ్చిన పోలీసులు సైతం కొంత ఇబ్బంది పడాల్సి వచ్చింది. సభ మూడు గంటలకు ప్రారంభ కానుండంతో బందోబస్తుకు వచ్చిన వారికి సమయం లేకపోవడంతో ఎక్కడివారు అక్కడే విధులు నిర్వహించే చోటనే భోజనాలు చేశారు.

సభలో పల్లీలకు గిరాకీ...

కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజా ఆశీర్వాద సభకు సీఎం రానుండటంతో సభకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఉదయం 11 గంటల నుంచి సభా వేదిక వద్ద ఏర్పాటు చేసి సభా ప్రాంగణంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కానీ సీఎం 3 గంటల వరకు రాకపోవడంతో పల్లీలకు గిరాకీ ఏర్పడింది. పల్లీలు అమ్ముకునే వారు సభ లోపలికి రావడంతో నాయకులు, కార్యకర్తలు ఎగబడి కొనుగోలు చేశారు.

జై కేసీఆర్.. జై వనమా..

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొన్న ప్రజాఆశీర్వాద సభలో ధన్‌బాద్ పంచాయతీకి చెందిన ఓ యువతి ఆద్యంతం కళాకారుల ప్రదర్శనల సందర్భంగా కేరింతలు కొడుతూ వారిని ఉత్సాహపరిచింది. అంతేకాకుండా తన అరచేతులలో జై కేసీఆర్.. జై వనమా.. అని గోరింటాకు పెట్టుకుని అభిమానాన్ని చాటుకుంటూ బహిరంగ సభలో ప్రదర్శించింది.

హ్యాపీ బర్త్ డే హుస్సేన్...

సింగరేణి(కొత్తగూడెం): ఆదివారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన సీఎం కేసీఆర్‌కు కొత్తగూడెం టీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు, తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ హుస్సేన్ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు ఇమామ్ జామీ (దట్టీ) కట్టి, తన పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రికి పాదాభివందనం చేసి ఆశీర్వాదం పొందారు

సభకు తరలిన టీబీజీకేఎస్ నాయకులు...

కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ ప్రజా ఆశీర్వాద సభకు కొత్తగూడెం ఏరియా టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ ఆధ్వర్యంలో కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు వనమా వెంకటేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా కొత్తగూడెం ఏరియా పరిధిలోని ధన్‌బాద్, గౌతంపూర్, పెనగడప, రాంపురం, రుద్రంపూర్, 3 ఇంక్‌లైన్, 4 ఇంక్‌లైన్ వాసులు నాయకులు ఏర్పాటు చేసిన వాహనాల్లో తరలివచ్చారు.

కాంట్రాక్ట్ కార్మికుల ఊసెత్తని ముఖ్యమంత్రి..

సార్ (ముఖ్యమంత్రి) వస్తారు... తమకేమైన హామీ ఇచ్చి, మా బతుకుల్లో వెలుగులు నింపుతారు. 2014 ఎన్నికల సందర్భంగా కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఇచ్చిన ముఖ్యమంత్రి కాంట్రాక్ట్ కార్మికుల పర్మనెంట్ హామీని నెరవేరుస్తారని ఎదురు చూసిన కాంట్రాక్ట్ కార్మికులకు చుక్కెదురైంది. కనీసం వారి ఊసెత్తకపోవటం విచారకం. అంతే కాకుండా సింగరేణిలో కేంద్ర వాటా 49శాతం గురించి మాట్లాడారు కానీ, పర్మనెంట్ కార్మికులకు గతంలో ఇచ్చిన ఇన్‌కమ్ ట్యాక్స్ రద్దు, సొంతింటి కల, నూతన బావులు, కొత్త ఉద్యోగాల గురించి మాట్లాడి తమ కుటుంబాల్లో వెలుగులు నింపుతారను కున్న కార్మికులకు మొండిచేయి చూపించారని, సింగరేణి కార్మికులు, కార్మిక కుటుంబాలు వాపోతున్నాయి.


సభలో అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు తదితరులు


నవభారత్: సభకు తరలివస్తున్న కార్యకర్తలు


డప్పులతో ర్యాలీగా వస్తున్న జనం


కొత్తగూడెం హెడ్డాఫీస్ సమీపంలో భోజనాలు చేస్తున్న పోలీసులు


సభలో పల్లీలు కొంటున్న కార్యకర్తలు


సూపర్‌బజార్(కొత్తగూడెం): గోరింటాకుతో యువతి అభిమానం


సీఎం పర్యటనతో నిర్మానుష్యంగా సంత ప్రాంతం


సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న కోనేరు చిన్ని, పూర్ణచందర్‌రావు, తెల్లం వెంకట్రావు


సింగరేణి(కొత్తగూడెం): ముఖ్యమంత్రికి ఇమామ్ జామీ కడుతున్న హుస్సేన్


సింగరేణి(కొత్తగూడెం): ప్రజా ఆశీర్వాద సభకు బయలు దేరిన టీబీజీకేఎస్ నాయకులు

పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తుల సందడి


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పాల్వంచ: మండలంలోని శ్రీకనకదుర్గమ్మ (పెద్దమ్మగుడి) ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాలు సమర్పించడంతో పాటు అన్నప్రాశన, తలనీలాలు, అమ్మవారికి ఒడిబియ్యం, చీరలు, పసుపు, కుంకుమ సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులకు ఉచిత పులిహోర ప్రసాద వితరణ, మంచినీటి వసతి కల్పించారు. కొల్లు ప్రభాకర్ రెడ్డి, గోవిందమ్మ దంపతులు రూ.10,011 నగదును విరాళంగా సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు మహిపతి రామలింగం, సందుపట్ల శ్రీనివాస్ రెడ్డి, చింతా నాగరాజు, గంధం వెంగళరావు, సంకా వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి..


రోళ్లపాడులో ప్రచారం నిర్వహిస్తున్న హరిప్రియ

టేకులపల్లి: మండలంలో గతంలో ఎవరూ చేయని అభివృద్ధి చేశానని, రూ.కోట్లు ప్రభుత్వంతో కొట్లాడి తీసుకొచ్చానని తాను చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేసి గెలిపించాలని ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి బానోతు హరిప్రియ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండల కమిటీ ఆధ్వర్యంలో రోళ్లపాడు, తొమ్మిదోమైలు తండా, బేతంపూడి, గోలియాతండా, తడికలపూడి, తావుర్యాతండా, కొత్తతండా(పి), రాంపురం పంచాయతీల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో అమలైన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. బొమ్మెర్ల వరప్రసాద్, బోడ బాలు, చీమల సత్యనారాయణ, బానోతు రామ, కంభంపాటి చంద్రశేఖర్, దళపతి శ్రీనివాస్‌రాజు, బానోతు కిషన్, జాటోతు నరేష్, ఆమెడ రేణుక, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సారూ 'కారు' డ్రైవర్ల పరిస్థితి ఏంటి ?


నిరసన తెలుపుతున్న అద్దె వాహనాల డ్రైవర్లు

సింగరేణి(కొత్తగూడెం)/పాల్వంచ/కొత్తగూడెం అర్బన్: సీఎం కేసీఆర్ పాల్గొన్న ప్రజా ఆశీర్వాద సభలో కేటీపీఎస్ అద్దె వాహనాల డ్రైవర్లు ప్లకార్డులతో నిరసన తెలిపారు. డ్రైవర్లు కూడా 15 ఏళ్లుగా కేటీపీఎస్‌లో విధులు నిర్వర్తిస్తుండగా, తెలంగాణ ఏర్పడ్డాక కటాఫ్ డేట్ ప్రకటించి పలువురిని ఆర్టిజన్లుగా గుర్తించారని అందులో పేర్కొన్నారు. అయితే, హైర్ వాహనాల డ్రైవర్లకు అన్యాయం జరిగిందని... తమకు అన్ని అర్హతలు ఉన్నా కేటీపీఎస్ యాజమాన్యం విస్మరించిందని తెలిపారు. ఈ మేరకు 'కారు గుర్తు పెట్టుకున్న టీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీపీఎస్‌లో అదే కారు నడుపుకుంటూ జీవితాలు సాగిస్తున్న మాకు అన్యాయం చేశారు 'అంటూ నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. నిరసన తెలిపిన వారిలో అబ్దుల్, రాజ్‌కుమార్, సురేందర్, దేవా తదితరులు ఉన్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన చందు నాయక్


సీఎం కేసీఆర్‌తో చందు నాయక్ కరచాలనం

పాల్వంచ: ప్రజా ఆశీర్వాద సభకు వచ్చిన సీఎం కేసీఆర్‌ను పాల్వంచకు చెందిన పెద్దమ్మగుడి మాజీ డైరెక్టర్ భూక్యా చందు నాయక్ (చంద్రశేఖర్) కలిశారు. రాజ్యసభ సభ్యుడు ఎంపీ వద్దిరాజు ఆధ్వర్యంలో హెలీప్యాడ్ వద్ద కేసీఆర్‌ను పరిచయం చేసుకుని మాట్లాడారు.

డ్రెయినేజీ పనులు పూర్తయ్యాయా..?


సభా ప్రాంగణంలో రమేష్‌తో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

కొత్తగూడెంరూరల్: శ్రీనగర్ పంచాయతీలోని డ్రెయినేజీ పనులు ఎంత వరకు పూర్తయ్యాయని సీఎం కేసీఆర్ స్వయంగా తెలంగాణ ఉద్యమకారులు శ్రీనగర్ ఉప సర్పంచ్ లగడపాటి రమేష్ చంద్‌ను అడిగారు.

కొత్తగూడెం పట్టణంలోని పలు వార్డుల నుంచి వచ్చే మురుగు శ్రీనగర్ గ్రామ పంచాయతీలోకి వస్తుందని.. దీనికి శాశ్వత పరిష్కారం చేయాలని ఉప సర్పంచ్ లగడపాటి రమేష్ చంద్ సెప్టెంబర్ 4న హైదరాబాద్ వెళ్లి ప్రగతి భవనంలో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సీఎం స్పందించి రూ.50 లక్షలు మంజూరు చేయాలని కలెక్టర్ ప్రియంకను ఆదేశించారు. జిల్లా మినరల్ ఫండ్ నుంచి కలెక్టర్ నిధులు కేటాయించారు. ఈ మేరకు ఆదివారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ప్రజా ఆశీర్వాద సభకు వచ్చిన సందర్భంగా లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీనగర్ పంచాయతీకి డ్రెయినేజీలకు కేటాయించిన నిధులతో పనులు ఎంత వరకు జరిగాయని ఉప సర్పంచ్ లగడపాటి రమేష్ చంద్‌ను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థి ఉద్యమాల శక్తి జంపాల, నీలం


జెండా ఎగురవేస్తున్న గుమ్మడి నర్సయ్య

ఇల్లెందురూరల్: మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానం వెలుగులో బలమైన ప్రజా ఉద్యమాన్ని, విద్యార్థి సంఘాన్ని నిర్మించేందుకు నిరంతరం కృషి చేసిన నీలం రాంచంద్రయ్య, జంపాల చంద్రశేఖర ప్రసాద్ స్ఫూర్తితో నేటి యువత పోరాటాలతో ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు. మండలంలోని బొజ్జాయిగూడెం సమీపంలోని చీకటి గండ్లు అడవిలో ఆదివారం నీలం, జంపాల వర్ధంతి నిర్వహించారు. స్మారక స్తూపం వద్ద గుమ్మడి నర్సయ్య ఎర్రజెండా ఎగురవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాలను, విద్యార్థి ఉద్యమాలను నిర్మిస్తూ చైతన్యం కలిగిస్తున్న విప్లవోద్యమ నాయకులను విజయవాడలో అరెస్టు చేసి చీకటి గండ్ల ప్రాంతంలో అత్యంత కిరాతకంగా చిత్రహింసలకు గురిచేసి ఎన్‌కౌంటర్ చేశారని గుర్తుచేశారు. వారి ఆశయాల బాటలో యాభై ఏళ్ల విప్లవోద్యమం ముందుకు కొనసాగుతూనే ఉందన్నారు. నేడు దేశంలో ఫాసిస్టు విధానాలను మోదీ ప్రభుత్వం అమలు చేస్తూ, ప్రశ్నించే గొంతుకలను, హక్కుల సంఘాల నేతలను జైళ్లలో పెట్టిస్తోందని విమర్శించారు. ఈ సమయంలో బలమైన ప్రజాఉద్యమాలను నిర్మించేందుకు అమరులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గుమ్మడి అనురాధ, చంద్ర అరుణ, కాంపాటి పృథ్వీ, యనగంటి వంశీవర్ధన్, బుర్ర వెంకన్న, యాకూబ్‌షావలీ, కోటయ్య పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే గుర్తింపు


వన మహోత్సవానికి హాజరైన పద్మశాలీలు

ఇల్లెందురూరల్: సంఘంలోని సభ్యులందరూ ఐక్యంగా ఉన్నప్పుడే గుర్తింపు వస్తుందని పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోచికొండ సత్యనారాయణ అన్నారు. మండలంలోని రొంపేడు గ్రామ సమీపంలోని మామిడితోటలో ఆదివారం పద్మశాలీ సంఘం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీలు విద్య, రాజకీయ రంగాలలో ఉన్నత స్థాయికి చేరకొని ప్రతీఒక్కరికి తోడ్పాటు అందించాలని కోరారు. రాజకీయాల్లో రాణిస్తున్న కుల ప్రతినిధులకు సభ్యులు బాసటగా నిలవాలన్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ విధులలో ఉన్న పద్మశాలీల గౌరవ, మర్యాదలకు భంగం వాటిల్లకుండా, ఇతర వర్గాల చేత అణచివేతకు గురికాకుండా సంఘం సమష్టిగా అండగా నిలవాలని కోరారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోచికొండ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా శంకరలింగం, గౌరవ సలహాదారులుగా సిరిమల్లె రమేష్, పెద్దూర్తి నర్సయ్య, కందికట్ల సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా దోమల మహేష్, ఉపాధ్యక్షుడిగా సిరిమల్లె రాజు, ఆడెపు నర్సింహారావు, కోట కిషోర్, సిరిమల్లె నాగరాజు, చిలువేరు రమేష్, కార్యదర్శులుగా సతీష్, రాధాకృష్ణ, శివకుమార్, సంజయ్, కందికట్ల భిక్షపతి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజు, ఈశ్వర్, రాహుల్, రాంచందర్, వెంకటరాజు, చెన్నూరి సురేష్, విశ్వనాథం, వెంకటేశ్వర్లు తదితరులు ఎన్నికయ్యారు.

కార్మిక సంఘాల్లోనూ కప్పగంతులు

- ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో యూనియన్ నేతల తీరు
- ఒక యూనియన్ నుంచి మరో యూనియన్‌లో చేరిక
- రాజకీయ పార్టీలను తలపిస్తున్న విద్యుత్ కార్మిక సంఘాల వైఖరి


కేటీపీఎస్ కర్మాగారం

పాల్వంచ: రాజకీయ పార్టీల మాదిరిగా విద్యుత్ కార్మిక సంఘాల తీరు తలపిస్తోంది. ఏ కార్మిక సంఘం అయినా ఆ సంస్థలో పనిచేసే కార్మికుల శ్రేయస్సు కోసం పాటుపడుతుంటాయి. కానీ ఇప్పటికే విద్యుత్ సంస్థల్లో పుట్టగొడుగుల్లా కార్మిక సంఘాలు పుట్టుకొచ్చాయి. ఇక ఆయా సంఘాల్లో ఆధిపత్య పోరు అధికమే. సంస్థ నుంచి ఉద్యోగులు, కార్మికులకు అందాల్సిన బెనిఫిట్స్ కోసం నిత్యం శ్రమిస్తుంటారు. దీని కోసం భారీ కసరత్తుతో పాటు, అనేక ఆందోళనల కార్యక్రమాలు నిర్వహించడంలో వెనుకాడరు. అయితే ఈ సంఘాల్లో ఉండే నేతల తీరు ఎన్నికల సమయాల్లో మరోలా ఉంటోంది. వారి కేడర్‌ను దృష్టిలో పెట్టుకుని రాజకీయ పార్టీలతో ప్రత్యేక ఒప్పందాలకు తెర తీస్తుంటారు. ఈ సంఘాల్లో కొన్ని ఆయా రాజకీయ పార్టీలకు అనుబంధంగా పనిచేస్తుండటం, అందులో క్రియాశీలకంగా పనిచేసే నేతలు తమ పదవులను అడ్డుపెట్టుకుని వారి ఓట్ల శాతాన్ని చెప్పుకుని ఇతర నేతలతో బేరసారాలు చేసే పరిస్థితులు కూడా లేకపోలేదు. వీరిని నయానో, భయానో వారి వైపు ఉండేలా చూసుకోవాలని సైతం ఆయా పార్టీల నాయకులు సైతం రంగంలో దిగడం జరుగుతుంది.

ఎన్నికల సమయాల్లో హడావుడి...

ముఖ్యంగా శాసనసభ ఎన్నికల సమయాల్లో ఆయా కార్మిక నేతలు హడావుడి చేస్తుంటారు. వారికి అనుకూలమైన పార్టీ నేత వైపు మొగ్గు చూపించాలనే లక్ష్యంతో పనిచేస్తుంటారు. అవసరమైతే వారి కార్మిక సంఘాలకు సైతం రాజీనామా చేసి మరో యూనియన్లలో చేరేందుకు కూడా వెనుకాడరు. ఎంతోకాలం కష్టపడి పనిచేసిన కార్మిక సంఘాన్ని కాదని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అధికార యూనియన్లలో చేరుతుంటారు. తద్వారా భవిష్యత్‌లో వారి హవా నడిపించాలన్నదే వారి ఆశ. మళ్లీ ఎన్నికలు వస్తే అప్పుడు ప్రభావితం చేసే నేతతో చేతులు కలిపి మళ్లీ ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చే పార్టీకి పనిచేస్తుండటం కనిపిస్తుంటుంది.

కండువాలు మార్చడంలో వీరూ తక్కువేం కాదు..

యూనియన్ల కండువాలు మార్చడంలోనూ విద్యుత్ కార్మిక సంఘాల నేతలు రాజకీయ పార్టీలకు తక్కువేం కాదని నిరూపించుకుంటారు. ఏ యూనియన్‌లో ఉన్నా సరే చేసే లక్ష్యం ఉద్యోగ, కార్మికుల కోసం పనిచేయడమే.. కానీ వీరి రాజకీయ ఎత్తుగడలు మాత్రం మరోలా ఉంటుండటంతో కండువాలు మార్చుకోవడం, వారి పదవులను అడ్డుపెట్టుకుని ఇతర బలమైన యూనియన్లలో చేరి వారి సత్తా చాటాలని చూస్తుంటారు. జెన్‌కో వ్యాప్తంగా ఉన్న కార్మిక సంఘాలతో పాటు, ముఖ్యంగా కేటీపీఎస్‌లో ఉండే కార్మిక సంఘాల్లో ముఖ్య నేతలు ఉన్నారు. వారు ఉండే యూనియన్లలో సైతం గ్రూపులు చేసి స్టేట్‌మెంట్లు ఇచ్చుకోవడం, పైరవీలు చేసి సంపాదించుకోవడం, పార్టీలు మారితే వచ్చే అమ్యామ్యాల కోసం వెంపర్లాడటం, బలమైన ఎమ్మెల్యే అభ్యర్థులతో బేరసారాలు ఆడి ఎంతో కొంత వెనుకేసువాలనే దురుద్దేశాలు అనేకం. వీరి హడావుడిపై తోటి కార్మికులు, ఉద్యోగులు సైతం చిత్రంగా చూస్తుంటారని పలువురు చెప్పుకుంటున్నారు. కాగా ఇప్పటికే కేటీపీఎస్‌లో పనిచేసే ప్రధాన పార్టీలకు అనుబంధంగా ఉండే నేతల్లో ఈ కండువాలు మార్చుకునే తీరు ఇప్పటికే చెప్పకనే చెప్పినట్లు ప్రారంభమైందని వాపోతున్నారు.